సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 17 । అక్టోబర్ । 2024



వీరుల గాథలు తెలుసుకొనేలా..

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు వీరగాథ్ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నారు. తాజాగా వీరగాథ 4.0 ప్రాజెక్ట్‌ను అందుబాటులోకి తెచ్చారు. 8లో ▸



ద్వారకాతిరుమల సర్పంచ్‌పై వేటు

ద్వారకాతిరుమల సర్పంచ్ కుంటం స్వర్ణలతపై సస్పెన్షన్ వేటు పడింది. దుర్వినియోగమైన నిధులు రికవరీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 8లో ▸



ఫిర్యాదుల బాక్సు తప్పనిసరి

వసతి గృహంలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి ఆదేశించారు. కలిదిండి, కోరుకొల్లులోని మూడు హాస్టళ్లలో తనిఖీ చేశారు. 8లో ▸

సిండికేట్లదే పెత్తనం

- కొత్తవారి షాపులపై కూటమి సిండికేట్ల కన్ను
- తమతో కలుపుకునేందుకు బెదిరింపులు.. బుజ్జగింపులు
- అంగీకరించిన వారికే షాపులు
- లేదంటే షాపులు దొరక్కుండా.. లైసెన్స్ రాకుండా అడ్డుకునే ఎత్తుగడలు
- గ్రామాల్లో షాపుల కోసం సిండికేట్ లాటరీలు



సాక్షి, భీమవరం: కొత్త మద్యం పాలసీలో కీలక ఘట్టం ముగిసింది. లాటరీలో కూటమి నేతలే చాలా దుకాణాల్లో పాగా వేశారు. మద్యం వ్యాపారం మొత్తం తమ కనుసన్నల్లోనే జరిగేలా బయటి వారికి దక్కిన షాపులపై కన్నేశారు. నయానో, భయానో వారిని తమ సిండికేట్లలో కలుపుకునే పనిలో పడ్డారు. వ్యాపారం సజావుగా సాగాలంటే తమతో కలవాల్సిందేనని సూచిస్తున్నారు. మరోపక్క షాపులు ఎవరెక్కడ ఏర్పాటుచేయాలనే విషయమై లాటరీలు తీస్తున్నారు. లాటరీ ద్వారా జిల్లాలోని 175 మద్యం షాపులు కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా కూటమి నేతలు సిండికేట్లుగా జతకట్టి మెజార్టీ షాపులు దక్కించుకున్నారు. భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తదితర చోట్ల సిండికేట్లు ప్రాబల్యం ఎక్కువగా ఉంది. దరఖాస్తు ప్రక్రియ నుంచి సిండికేటు హవానే నడుస్తోంది. మద్యం వ్యాపారం అంతా తమ ఆధ్వర్యంలోనే జరిగేలా సిండికేట్ పెద్దలు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

అర్బన్, రూరల్ ఏరియాల్లో షాపులు దక్కించుకున్న బయటి వ్యక్తులను తమ సిండికేట్‌లో వ్యాపార భాగస్వాములుగా చేరి వాటాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. లేదంటే షాపులకు గుడ్‌విల్ ఇస్తామంటున్నారు. తమతో కలవకుంటే వ్యాపారం చేయడం కష్టమని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారుల నుంచి సహాయ నిరాకరణ తప్పదంటున్నారు. అవసరమైతే షాపులు దొరక్కుండా, లైసెన్సులు రాకుండా అడ్డుకునే ఎత్తుగడలు వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా షాపులు దక్కించుకున్న వారిలో కొత్తగా మద్యం వ్యాపారంలోకి అడుగుపెట్టిన వారు 20 శాతం పైగానే ఉంటారని అంచనా. లాటరీలో షాపులు దక్కాయన్న ఆనందం వారికి ఎక్కువసేపు లేదు. సిండికేట్ చెప్పినట్టు వినకుంటే అధికారులతో లేనిపోని కేసులు పెట్టించి వ్యాపారాన్ని దెబ్బతీస్తారన్న భావనలో వారున్నారు. రెండేళ్ల వ్యాపారంతో పాటు దరఖాస్తుల కోసం పెట్టిన పెట్టుబడులు కోల్పోవాల్సి వస్తుందంటున్నారు. సొంతంగా వ్యాపారం చేయాలనుకున్నా ఆయా కారణాలతో తప్పనిసరి పరిస్థితుల్లో సిండికేట్లలో సభ్యులుగా చేరుతున్నారు.

షాపుల ఏర్పాటుకు లాటరీలు

గతంలో గ్రామాల వారీగా షాపులకు టెండర్లు పిలిచేవారు. దీనివలన ఏ గ్రామంలో షాపు దక్కించుకున్న వారు అదే గ్రామంలో షాపు ఏర్పాటు చేయాలి. నూతన మద్యం పాలసీ గెజిట్‌లో మండలాల వారీగా షాపుల నంబర్లు కేటాయించినా, ఏరియా పేరు పేర్కొనలేదు. దీంతో మండలంలోని ఏ గ్రామంలోనైనా షాపులు ఏర్పాటుచేసుకునే అవకాశం వ్యాపారులకు ఉంది. అధికంగా అమ్మకాలు జరిగే మేజరు పంచాయతీలు, ప్రధాన కూడళ్లలో షాపుల ఏర్పాటుచేసేందుకు వ్యాపా రులు ఆసక్తి చూపిస్తు న్నారు. ఇప్పుడదే సిండికేట్లకు పెద్ద తలనొప్పిగా తయారైంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు మాకూ వాటా కావాలంటూ డిమాండ్ చేస్తున్న తరుణంలో ఏరియా ఎంపికల్లో కూటమి చోటామోటా నాయకులు చేతివాటం చూపిస్తున్నారు. వారి అండదండలు ఉన్నవారికి మేజరు పంచాయతీల్లో, కూడళ్లలోనూ మద్యం దుకాణాల ఏర్పాటుకు సిఫార్సు చేస్తున్నారు. కొన్ని మండలాల్లో 6 నుంచి 9 దుకాణాలు ఉన్నాయి, ఆయా మండలాల్లో ఎవరు ఏ గ్రామంలో షాపులు ఏర్పాటుచేసుకోవాలనే విషయమై ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణలో లాటరీలు నిర్వహించినట్టు తెలిసింది.

తెరుచుకుంటున్న షాపులు

అన్ని సవ్యంగా జరిగిన చోట షాపులు ప్రారంభించి **స్టాకు కోసం ఇం**డెంట్ల పనిలో సిండికేట్లు **ఉన్నాయి. అందుకోసం** ఎక్సైజ్ శాఖ 15 రోజుల **గడువుపై తాత్కాలిక** లైసెన్సులు ఇస్తున్నారు. **జిల్లా వ్యాప్తంగా బుధ**వారం పలు షాపులు **యజమానులు స్టాకు ఇం**డెంట్ పెట్టుకున్నారు. **నిబంధనలు మేరకు ఉ**న్న షాపులకు పర్మినెంట్ **లైసెన్సులు జారీచేయ**నున్నట్టు ఎక్సైజ్ అధికా**రులు చెబుతున్నారు.**

17 షాపులు మహిళలకే

జిల్లాలో 17 మద్యం షాపులు మహిళలకు దక్కాయి. వీటిలో భీమవరం అర్బన్, పెనుమంట్ర మండలంలో మూడు చొప్పున షాపులు రాగా తణుకు అర్బన్, కాళ్ల, పెంటపాడు మండలాల్లో రెండు చొప్పున. తాడేపల్లిగూడెం అర్బన్, తణుకు, భీమవరం, ఆచంట, పెనుగొండ మండలాల్లో ఒక్కో షాపు దక్కాయి.

మెరుగైన వైద్య సేవలందాలి



ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఏరియా హాస్పిటల్స్, సీహెచ్‌సీల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి వైద్యులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో ఏరియా హాస్పిటల్స్, పీహెచ్‌సీల పనితీరుపై వైద్యులు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రుల పని వేళల్లో వైద్యులు ఆస్పత్రుల్లో ఉండాలన్నారు. కొన్ని వైద్య సేవలకు నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని విచారణలో వాస్తవమని తెలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌కు పేదవర్గాల ప్రజలు వస్తుంటారని, వాళ్ల వద్ద నగదు వసూలు క్షమించరాని నేరం అన్నారు. ఆకివీడు, ఆచంట ఆసుపత్రులలో వైద్య సేవలను మెరుగుపరుచుకోవాలని హెచ్చరించారు. ఇన్‌పేషెంట్లు, మైనర్ సర్జరీలు మెరుగుపర్చాలని సూచించారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన నిధులు ఖర్చు చేయకుండా ఉంచడంలో ప్రయోజనం లేదని, వాటిని తప్పకుండా ఖర్చు చేసి ఆసుపత్రుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డా.పి.సూర్యనారాయణ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నిట్‌లో టెక్రియా ఫీవర్



టెక్రియా సింబల్ వద్ద రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి

తాడేపల్లిగూడెం: నిట్‌లో టెక్రియా 2కె24 ఫీవర్‌తో విద్యార్థులు జోష్‌తో ఉన్నారు. గురువారం నుంచి శనివారం వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. విద్యార్థులు బుధవారం సాయంత్రం ట్రయల్ నిర్వహించారు. విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి అన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సమాజహిత పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. టెక్రియా 2కె24లో భాగంగా గురువారం సాయంత్రం ప్రాంగణంలోని గ్రంథాలయం వద్ద బైక్ స్టంట్ షో, 18, 19 తేదీల్లో ఇస్రో ఎగ్జిబిషన్, టెక్నికల్ ఈవెంట్స్ జరుగనున్నాయి.

ఏజెన్సీలో భారీ వర్షం



బుట్టాయగూడెంలో వర్షం కురుస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ఉండగా, మధ్యాహ్న సమయానికి కాస్త మబ్బు అనిపించినప్పటికీ ఒక పక్క ఎండ కాస్తూనే మరొక పక్క వర్షం దంచికొట్టింది. గత రెండు రోజులుగా ఏజెన్సీలో ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తూనే ఉంది.

ఎన్టీఆర్ వైద్య సేవలు ఉచితంగా అందించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ఎన్టీఆర్ వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రులల్లో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్టీఆర్ వైద్య సేవలకు సంబంధించి డిస్టిక్ డిసిప్లినరీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని హాస్పిటల్స్ యాజమాన్యం పేషెంట్ల నుంచి నగదు వసూలు చేస్తున్నారని, వైద్యం అందించడంలో అలసత్వం వహిస్తున్నారని ఫిర్యాదులు అందాయన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలను ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తుందని రోగుల నుంచి ఎలాంటి నగదును వసూలు చేయరాదన్నారు. సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారి డి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పనులపై సమీక్ష

ఏలూరు(మెట్రో): జెడ్పీ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సమీక్షించారు. బుధవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ సీఈవో, భీమవరం, జంగారెడ్డిగూడెం, రాజమండ్రి, నరసాపురం, కొవ్వూరు డివిజన్‌కు సంబంధించిన పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ నుంచి మంజూరైన పనులు పురోగతిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

జల్లేరు జలాశయం నుంచి నీటి విడుదల

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం నుంచి పంటలకు బుధవారం నీటిని విడుదల చేశారు. సర్పంచ్ తెల్లం రాముడుతోపాటు రైతులు, పలువురు కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఏటా అక్టోబర్‌లో రబీ సీజన్‌కు సంబంధించి జలాశయం నుంచి నీటిని విడుదల చేయడం జరుగుతుందని ఎంఐ ఏఈ సురేష్ చెప్పారు.

వసతి గృహాల్లో కనీస వసతులు కల్పించాలి

ఏలూరు (టూటౌన్): వసతి గృహాల్లో కనీస వసతుల కల్పనపై దృష్టి సారించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్త కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ స్థానిక రైల్వే స్టేషన్ దగ్గరలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాలను బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతులపై వసతి గృహాల పరిశుభ్రత, మంచి నీరు, ఆహార, వైద్యం, రక్షణ సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పై అధికారులకు తెలియజేస్తే తక్షణ చర్యలు తీసుకుంటారని, అవసరమైన పక్షంలో న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు.

ద్వాక్రా మహిళపై టీడీపీ నేతల దాడి



బాధితురాలు ఉషారాణి

నూజివీడు: మిట్టగూడెంలో మంగళవారం రాత్రి ద్వాక్రా మహిళపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ నరదల ఏసుబాబు భార్య ఉషారాణి (36)తో పాటు మరికొందరు ద్వాక్రా సంఘంలో సభ్యులుగా ఉన్నారు. అదే గ్రూపులోని వెలివల రామశిరీష చెల్లించాల్సిన నగదు ఆలస్యమవడంతో ఉషారాణి అడగగా రామశిరీష గొడవకు దిగింది. ఇద్దరూ గొడవ పడుతుండగా రామశిరీష భర్త వెలివల రాము, తండ్రి పలగాని కొండయ్య, మామ వెలివల రామారావులు ఉషారాణిపై దాడి చేయడంతో పాటు కింద పడేసి మెడపై కాలు వేసి నొక్కారు. దాడి చేసిన వారంతా తెలుగుదేశం పార్టీకి చెందిన వారు. స్థానికులు ఉషారాణిని ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మద్యం షాపుల ఏర్పాటుపై నిరసన

పెనుగొండ: ఆచంట మండలం వల్లూరులో మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ బుధవారం రైతులు, మహిళలు నిరసన వ్యక్తంచేశారు. పంచాయతీ పరిధిలోని గెద్దాడ వారి పాలెం పంటకాలువ, నివాసాల మధ్య దుకాణం వల్ల ప్రతీ ఒక్కరూ ఇబ్బందుల పాలవుతారని నినాదాలు చేశారు. కళాశాలకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి.. అభ్యంతరం ఉంటే కలెక్టరుకు ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. మహిళలు వెనక్కి తగ్గకుండా నిరసన కొనసాగించారు. పెనుగొండలోనూ మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరాలు ఎదురయ్యాయి. పెనుగొండలో నివాసాల మధ్య మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వవద్దని అధికారులకు ఫిర్యాదు చేశారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై ఫిర్యాదు

కొయ్యలగూడెం: కన్నాపురం రోడ్డులోని వినాయక స్వామి గుడికి చేరువలో మద్యం దుకాణాన్ని ఏర్పాటును వ్యతిరేకిస్తూ వెంటనే నిలుపుదల చేయాలంటూ స్థానికులు తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. మద్యం దుకాణాన్ని దక్కించుకున్న సిండికేట్ వ్యక్తులు తమ ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. ఇదే ప్రాంతంలో ప్రైవేట్ హాస్పిటల్‌తో పాటు స్కూల్, కాలేజీ కూడా ఉన్నాయని మద్యం దుకాణం ఏర్పాటు వల్ల తమకు భద్రత లేకుండా పోతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.



వల్లూరులో అభ్యంతరం వ్యక్తం చేస్తున్న రైతులు, మహిళలు



కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న మహిళలు

నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు పెట్టొద్దు

ఏలూరు (టూటౌన్): జిల్లాలో మద్యం షాపులను ప్రజల నివాస ప్రాంతాల్లో పెట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. ఐద్వా జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన మహిళ సంఘం సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామల రాణి మాట్లాడుతూ షాపులు ప్రజల నివసిస్తున్న ప్రాంతాల దగ్గర పెట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మద్యాన్ని ఆదాయ వనరుగా రాష్ట్ర ప్రభుత్వం చూడటం వల్లే ఈ విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు జి శారద, హైమావతి, అరుణ కుమారి, వరలక్ష్మి, ఉషారాణి , రాజ్యలక్ష్ తదితరులు పాల్గొన్నారు.

• స్టేడియం ఇలా... క్రీడలు ఎలా ?



పడిపోయిన ఇండోర్ స్టేడియం



చినుకు పడితే చిత్తడే



హ్యాండ్‌బాల్ కోర్టు దుస్థితి

ఏలూరు నగరంలో నడిబొడ్డున ఉన్న ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో రోజు యువత క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ వంటి క్రీడలు ఆడతారు. స్టేడియంలోని గ్రౌండ్ అంతా పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగిపోయి విషసర్పాలకు నిలయంగా మారింది. చినుకు పడితే స్టేడియమంతా బురదగా మారి క్రీడాకారులు జారి ప్రమాదాలకు గురవుతున్నారు. క్రీడలను ప్రోత్సహిస్తామంటున్నారేగాని క్షేత్రస్థాయిలో సౌకర్యాలు మాత్రం లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆడుకునేందుకు సౌకర్యాలు కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



ఏలూరు ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిపోయిన దృశ్యం

వేడుకగా ఎదుర్కోలు ఉత్సవం

- హనుమద్, వెండి శేషవాహనాలపై తిరువీధి సేవ
- నేడు చినవెంకన్న తిరుకల్యాణ మహోత్సవం



ఎదుర్కోలు ఉత్సవంలో హారతి ఇస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో బుధవారం స్వామివారికి ఎదుర్కోలు ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి వెండి శేషవాహనంపై నిత్యకల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ విశేషంగా అలంకరించిన వేదికపై కల్యాణ మూర్తులను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకులు, పండితులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, విశిష్టతను కొనియాడారు. అలాగే రెండో జట్టు అమ్మవార్ల గుణగణాలు, కీర్తిని తెలియజేశారు. ఉదయం హనుమద్వాహనంపై, రాత్రి వెండి శేషవాహనంపై జరిగిన తిరువీధి సేవలు భక్తులకు నేత్రపర్వమయ్యాయి. ఆలయ ముఖ మండపంలో వామనావతారంలో దర్శనమిచ్చిన స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. శ్రీహరి కళా తోరణ వేదికపై జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు :

- ఉదయం 7 గంటల నుంచి – సింహ వాహనంపై గ్రామోత్సవం
- ఉదయం 8 నుంచి – భజనలు
- ఉదయం 9 నుంచి – కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు
- సాయంత్రం 4 నుంచి – నాదస్వరకచేరి
- సాయంత్రం 6 నుంచి – కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు
- రాత్రి 8 గంటల నుంచి – శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం వెండిగరుడ వాహనంపై గ్రామోత్సవం
- ప్రత్యేక అలంకారం: మోహిని



హనుమద్వాహనంపై రామావతారంలో స్వామి



వామనావతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు

శ్రీవారి కల్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవానికి క్షేత్రంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ అనివెట్టి మండపంలో స్వామివారి కల్యాణ వేదిక నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం నాటికి ఈ పనులు పూర్తవుతాయని ఆలయ ఈఓ తెలిపారు.



శ్రీవారి ఆలయ అనివెట్టి మండపంలో కల్యాణ వేదిక నిర్మిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు



జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన లిఫ్టర్లు

ఏలూరు రూరల్: జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఏలూరు లిఫ్టర్లు రెండు పతకాలు సాధించారని ఏలూరులోని స్టేట్ లెవెల్ ఖేలో ఇండియా సెంటర్ ఇన్‌చార్జి డీఎస్‌వీ వినాయక ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో జాతీయస్థాయి యూత్, జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయని వెల్లడించారు. ఇందులో పాల్గొన్న పీ.దివ్య జూనియర్ విభాగంలో 81 కేజీల కేటగిరిలో రజత పతకం, యూత్ విభాగం 71 కేజీల కేటగిరిలో రీనోమోల్ కాంస్య పతకం చేజిక్కించుకున్నట్లు వివరించారు. విజేతలను కోచ్ వీ ఉదయ్‌సందీప్, డీఎస్‌డీఓ డీ శ్రీనివాస రావు, ఎమ్మెల్యే బడేటి చంటి, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట రామయ్య అభినందించారు.

అనధికార దీపావళి బాణసంచా స్వాధీనం

తణుకు టౌన్: అధికారుల అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న దీపావళి బాణసంచా దుకాణాలపై దాడి చేసి రూ.2 లక్షల విలువైన బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. దువ్వ గ్రామంలోని జాతీయ రహదారి పక్కన గల షాపులో ఉండ్రాజవరం మండలం కే సావరం గ్రామానికి చెందిన బస్వా సుధాకర్, బద్దెల అన్నవరం ఎటువంటి అనుమతులు లేకుండా దీపావళి బాణసంచా విక్రయాలు చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు, ఇతర మధ్యవర్తులతో షాపులో తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.2 లక్షల విలువైన దీపావళి బాణసంచాను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వెండి కిరీటం అపహరణ

తణుకు టౌన్ : తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని శ్రీ విఘ్నేశ్వర ఆలయంలో వెండి కిరీటం అపహరణకు గురైంది. మంగళవారం రాత్రి విఘ్నేశ్వరునికి అలంకరించిన 500 గ్రాముల వెండి కిరీటం చోరీ జరిగిందని గ్రామానికి చెందిన గుణ్ణ హరి వెంకట రాజారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం.. కేసు నమోదు

పోలవరం రూరల్: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన నేరంపై ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉంగుటూరు మండలం కాగుపాడు గ్రామానికి చెందిన పోట్ల పెద్దిరాజు నిడదవోలులోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. పెద్దిరాజ తనకు యోగా టీచర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 2022లో రూ.2.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఎల్ఎన్‌డీపేట గ్రామానికి చెందిన చింతలచెరువు సుందర భాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వీరుల గాథలు తెలుసుకొనేలా..

- విద్యార్థులకు వీరగాథ 4.0 పోటీలు
- కేంద్రం ఆధ్వర్యంలో నాలుగు కేటగిరీల్లో
- పాఠశాల స్థాయిలో పూర్తయిన వీరగాథ ఎంట్రీలు
- నేటినుంచి నవంబర్ 10 వరకూ జిల్లా స్థాయిలో పోటీలు



జల్లికొమ్మర యూపీ స్కూల్లో వీరగాథ 4.0 పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పత్తేపురం జెడ్పీస్కూల్లో వీరగాథ పోటీ అంశాలను ఆన్‌లైన్ చేస్తున్న దృశ్యం

నిడమర్రు : విద్యార్థి స్థాయి నుంచే దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా వీరగాథ్ ప్రాజెక్ట్ అమలు చేస్తోంది. దీని కోసం 2021లో గ్యాలంటరీ అవార్డు పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్రం ఆశయాలకు తగ్గట్టుగా ఇప్పటికి మూడు విడతల్లో లక్షలాది మంది విద్యార్థులు ఈ వీరగాథ ప్రాజెక్ట్ సందర్భించి పోటీల్లో పాల్గొనేలా కృషి జరిగింది. ఇప్పటివరకూ వీరగాథ 1.0, 2.0, 3.0 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. తాజాగా వీరగాథ 4.0 ప్రాజెక్ట్‌ను అందుబాటులోకి తెచ్చింది. దేశం కోసం నిస్వార్థంగా ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిని వీరులను కేంద్రం గ్యాలెంటరీ అవార్డులిచ్చి సత్కరిస్తుంది. వారి విజయ గాథలు, దేశభక్తి తదితర వివరాలు దృశ్యరూపకంగా ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. వీటిని విద్యార్థులు వీక్షించి తగు విధంగా స్పందించి సృజనాత్మకంగా వారి మదిలోని భావాలను వెలిబుచ్చేలా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. దేశ రక్షణ శాఖ, కేంద్ర విద్యామంత్రిత్వ శాఖలు సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నాయి. పాఠశాల స్థాయిలో నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఈ పోటీల్లో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలు పాల్గొనే అవకాశం కల్పించారు. నేటి నుంచి నవంబర్ 10వ తేదీ వరకూ జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

3వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు

జిల్లా వ్యాప్తంగా మూడో తరగతి నుంచి 12వ (ఇంటర్) తరగతి వరకూ విద్యార్థులకు నాలుగు అంశాల్లో ఈ పోటీలు చేపడుతున్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలను పద్యాలు, కథలు, చిత్రలేఖనం, వ్యాసరచన, మల్టీమీడియా ప్రదర్శన వంటి అంశాల ద్వారా తెలిపేలా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయిలో ఎంపిక చేసిన నామినేషన్లను నేటినుంచి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. ఇప్పటికే 70 శాతం పాఠశాలలు ఈ పోటీలకు సంబంధించిన ఎంపిక చేసిన నామినేషన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అక్టోబరు 17 నుంచి నవంబరు 10వ తేదీ వరకు జిల్లా స్థాయి, నవంబరు 12 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి, డిసెంబర్ 4 నుంచి 24వ తేదీ వరకు జాతీయ స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తారు.

నాలుగు విభాగాల్లో పోటీలు

దేశభక్తి అంశాలే ప్రాతిపదికగా పాఠశాల వారీగా నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. 3–5 తరగతులకు ఒక విభాగంగా, 6–8 తరగతుల విద్యార్థులకు రెండో విభాగంగా, 9, 10 తరగతుల విద్యార్థులకు 3వ విభాగం, 11, 12 తరగతుల విద్యార్థులు నాలుగో విభాగంగా విభజించారు. 3–5 తరగతి విద్యార్థులకు పద్యం, కథ (150) పదాలు, చిత్రలేఖనం, పెయింటింగ్ 6–12 తరగతుల వారికి పద్యాలు, కథ, చిత్రలేఖనం, పెయింటింగ్, వ్యాసం మల్టీమీడియా ప్రదర్శన పోటీలు ఉన్నాయి. మల్టీమీడియా ప్రదర్శనలో ఒకటి లేదా రెండు నిమిషాల నిడివితో దేశభక్తికి సంబంధించిన ప్రదర్శన వీడియో రూపంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

దేశభక్తి ప్రదర్శించిన వారిని రోల్ మోడల్‌గా

వీరగాథ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వారికి నచ్చిన అంశాలను ఎంచుకునే అవకాశం కల్పించారు. దేశం కోసం అత్యున్నత త్యాగం చేసిన వారిని రోల్ మోడల్‌గా ఎంచుకుని, వారి నుంచి నేర్చుకున్న విలువలను ప్రస్తావించాలి. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వీరులు, బ్రిటీష్ వారిపై తిరుగుబాటులో స్ఫూర్తినిచ్చిన వీర మహిళలు, వారి పాత్ర ఇతర అంశాలు ఎంపిక చేసుకుని వివరించవచ్చు.

నాలుగు కేటగిరీల్లో 100 మంది ఎంపిక

3నుంచి 12వ తరగతి వరకూ విభజించిన నాలుగు కేటగిరిల నుంచి 100 మందిని ఎంపిక చేస్తారు. జిల్లాస్థాయి నుంచి నలుగురు, రాష్ట్ర స్థాయి నుంచి ఎనిమిది మందిని విజేతలుగా గుర్తిస్తారు. జాతీయ స్థాయి పోటీల్లో ఒక్కో కేటగిరి నుంచి 25 మంది చొప్పున 100 మందిని విజేతలుగా ప్రకటిస్తారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు సత్కారం, ధ్రువపత్రం అందిస్తారు. జాతీయస్థాయి విజేతలకు కేంద్రం రూ.10 వేలు చొప్పున నగదు పురస్కారంతో సత్కరిస్తారు.

ఉమ్మడి జిల్లా నుంచి 17,500 మంది

ఉమ్మడి జిల్లాలో 3 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న ప్రభుత్వ/ప్రైవేటు విద్యార్థులు 4.2 లక్షల మంది వరకూ ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకూ 17,500 మంది ఈ వీరగాథ పోటీల్లో పాల్గొన్నట్లు ప్రాథమిక అంచనాగా అధికారులు చెబుతున్నారు. జిల్లా స్థాయి పోటీలు వచ్చేనెల 10 వరకూ అవకాశం ఉన్నందున మరింత మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారులు కృషి చేస్తున్నారు.

ఎక్కువ మంది పాల్గొనేలా కృషి



“ వీరగాథ 4.0 పోటీల్లో 3 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఎక్కువ మంది పాల్గొనేలా ఉపాధ్యాయులు కృషి చేసేలా చర్యలు తీసుకున్నాము. ఆన్‌లైన్‌లో ఇంత వరకూ ఎంతమంది పాల్గొన్నారనే వివరాలు తెలియాల్సి ఉంది. ఇంకా ఎవరైనా ఉత్సాహంగా ఉంటే ఆయా పాఠశాలల తరుపున జిల్లా స్థాయి పోటీలకు నామినేషన్ కోసం దరఖాస్తు చేసుకునేలా కృషి చేస్తున్నాం.

– గొర్రెల బాలయ్య, ఎంఈవో–2, నిడమర్రు

వీరగాథ పోటీలపై కాంప్లెక్స్‌ల్లో శిక్షణ



కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వీరగాథ 4.0 పోటీలపై గడిచిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందించాం. ప్రభుత్వ / ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులు, గడిచిన యుద్ధాల్లో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని స్ఫూర్తిగా తీసుకునేందుకు ఈ పోటీలు దోహదపడతాయి.

– ఎస్.అబ్రహం, డీఈవో, ఏలూరు జిల్లా

బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు బాబు

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాలలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పురుషుల టీం సెలెక్షన్లు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి కళాశాలలకు, యూనివర్సిటీకీ కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ పోటీల్లో ఉభయ గోదావరి జిల్లాల నుంచి 20 టీంలు పాల్గొంటున్నాయని కళాశాల ప్రిన్సిపాల్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ జి.మోజెస్ తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెల 26 తేదీ నుంచి 29 తేదీ వరకూ చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సౌత్ జోన్ యూనివర్సిటీ టోర్నమెంటులో పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ జి.పాండురంగరాజు, జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బీవీ నరసింహరాజు, కె.శివరామరాజు, ఎస్‌వీజీఎల్ఎస్ వర్మ, దిలీప్, ఎల్.రమేష్ వివిధ కళాశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

హాస్టళ్లలో ఫిర్యాదుల బాక్సు తప్పనిసరి

సీనియర్ సివిల్ కోర్టు జడ్జి లక్ష్మి



కలిదిండి బాలికల హాస్టల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి

కలిదిండి (కైకలూరు): నియోజకవర్గంలోని ప్రతి వసతి గృహంలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయాలని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి ఆదేశించారు. కలిదిండి మండలం కలిదిండి, కోరుకొల్లు గ్రామాల్లోని మూడు హాస్టళ్లలో వసతి సౌకర్యాలపై బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా వార్డెన్ల నుంచి విద్యార్థుల సంఖ్య, భోజనం నాణ్యత, తాగునీరు, దుప్పట్లు వంటి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఇకపై ప్రతి వసతి గృహంలో ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేసి తాళాలను మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుల వద్ద ఉంచాలన్నారు. విద్యార్థులు వారి సమస్యలను కాగితంపై రాసి బాక్సులో వేయాలని సూచించారు. కోర్టు నుంచి సభ్యులు నెలలో రెండు పర్యాయాలు వచ్చి బాక్సులు తీసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, పి.ప్రసన్నకుమార్, వార్డెన్లు నిర్మల, నాగమణి, శివ, కోర్టు సిబ్బంది భవానీ, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల సర్పంచ్‌పై సస్పెన్షన్ వేటు

- రూ.53 లక్షల నిధుల దుర్వినియోగంపై చర్యలు
- 15 రోజులలోపు సొమ్ము రికవరీకి కలెక్టర్ ఆదేశాలు



ద్వారకాతిరుమల గ్రామ పంచాయతీ కార్యాలయం

ద్వారకాతిరుమల: గత కొన్నాళ్లుగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ద్వారకాతిరుమల గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలతపై సస్పెన్షన్ వేటు పడింది. అలాగే దుర్వినియోగమైన నిధులు రూ.53,57,376ను 15 రోజుల లోపు ఆమె నుంచి రికవరీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిధులు దుర్వినియోగం జరిగినట్టు గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త ఈ ఏడాది జనవరి 29న స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌ను విచారణకు ఆదేశించారు. విచారణ జరిపిన అధికారులు గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత రూ. 53,57,376, అలాగే పంచాయతీ కార్యదర్శి ఎల్ వెంకటేశ్వరరావు రూ.1,30,85,013, గతంలో ఇక్కడ పంచాయతీ ప్రత్యేక అధికారిగా పనిచేసిన ఎస్ ఆశీర్వాదం రూ.18,73,538 దుర్వినియోగం చేసినట్టు తేల్చారు. దీనికి సంబంధించి ఇటీవల కార్యదర్శి వెంకటేశ్వరరావును, లింగపాలెం ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆశీర్వాదంలపై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఇదిలా ఉంటే సర్పంచ్ కుంటం స్వర్ణలతకు ఈ ఏడాది జూలై 29న ప్రస్తుత కలెక్టర్ వెట్రిసెల్వి షోకాజ్ నోటీసు జారీ చేయగా, దానికి ఆగస్టు 9న సర్పంచ్ సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో కె.అనురాధ సర్పంచ్ స్వర్ణలతను 6 నెలల పాటు సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దుర్వినియోగమైన సొమ్మును 15 రోజుల లోపు సర్పంచ్ నుంచి రికవరీ చేసి, గ్రామ పంచాయతీ ఖాతాకు జమచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఉప సర్పంచ్ బొండాడ సావిత్రికి సర్పంచ్ బాధ్యతలు అప్పగిస్తూ, ఈఓపీఆర్డీ ఏవీ సుబ్బరాయన్‌కు కౌంటర్ సైన్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంఎల్ఎస్ పాయింట్ ఆకస్మిక తనిఖీ



ముదినేపల్లి మండలం దాకరంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

కైకలూరు: రేషన్ దుకాణాలకు సరఫరా అవుతున్న బియ్యం బస్తాలు తూకం తక్కువ ఉంటున్నాయన్న ఆరోపణలపై కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. నిల్వల వివరాలను పరిశీలించారు. స్టాక్ పాయింట్ నుంచి సరఫరా చేసే నిత్యావసర సరుకులు నిబంధనల మేరకు తూకం ఖచ్చితంగా ఉండాలని సూచించారు. అనంతరం ముదినేపల్లి మండలం దాకరం, పేరూరు గ్రామాల్లోని రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. రెండు చోట్ల రేషన్ సరుకులు సరఫరా చేయకపోవడాన్ని గుర్తించారు. దీంతో డీలర్, ఎండీయూ ఆపరేటర్‌పై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్.రాజు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రజకులకు చెరువుల కేటాయింపుపై ఉత్తర్వులు



కట్లయ్యకు సర్క్యులర్ కాపీని అందజేస్తున్న డీఎల్‌పీఓ

ఏలూరు (టూటౌన్): గ్రామ పంచాయతీల్లో రజకులు వృత్తి చేసుకునేందుకు వీలుగా చెరువులు కేటాయించాలని ఆదేశిస్తూ ఏలూరు డివిజన్ పంచాయతీ అధికారి ఎం.సుందరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని రజకులకు వృత్తి చెరువులపై లీజులు చెల్లింపు విధానం లోపభూయిష్టంగా ఉండటం వల్ల చెరువులపై హక్కును కోల్పోయే పరిస్థితి నెలకొందని గతంలో చిలకలపల్లి కట్లయ్య అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీ నందు రజకులకు వారు వృత్తి చేసుకునేందుకు వీలుగా ఒక చెరువును కేటాయించి సదరు చెరువులో చేపల ఫలసాయం కూడా వారికే ఇవ్వవలసి ఉండగా జిల్లాలో కొన్ని పంచాయతీలు ప్రభుత్వ ఉత్తర్వులను పాటించడం లేదంటూ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఏలూరు డీఎల్‌పీఓ గ్రామ పంచాయతీలో రజకులకు కుల వృత్తి చేసుకునేందుకు వీలుగా చెరువులు కేటాయించేందుకు పలు సూచనలతో సర్క్యులర్‌ను జారీ చేశారు. ఇదే క్రమంలో పలు సూచనలు కూడా చేశారు. రజకులకు కేటాయించిన చెరువులను సబ్ లీజుకు ఇవ్వకుండా చూడాలని, గ్రామంలోని రజక సంఘాలు జిల్లా రజక సంఘానికి అనుబంధంగా గాని, రిజిస్ట్రేషన్ కాబడిన వారికి మాత్రమే గ్రామంలో చెరువులు కేటాయించాల్సిందిగా ఆదేశించారు. కేటాయింపులకు సంబంధించిన అన్ని వివరాలతో కూడిన విధంగా ఒక రిజిస్టర్ నందు పొందు పర్చాల్సిందిగా తెలియజేశారు. గ్రామ పంచాయతీలకు నష్టం వాటిల్లకుండా ఉండే విధంగా లీజులు నిర్ణయించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన గ్రామ కార్యదర్శులపై పంచాయతీ రాజ్ చట్టం అనుసరించి చర్యలు తీసుకోబడుతుందని డీఎల్‌పీఓ తెలియజేశారు. సర్క్యులర్ కాపీని బుధవారం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్యకు డీఎల్‌పీఓ అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కొల్లు మోషే మృతదేహం

కొయ్యలగూడెం: బయ్యనగూడెం వద్ద బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. మృతుడు రామానుజపురం గ్రామానికి చెందిన కొల్లు మోషే (30)గా పోలీసులు గుర్తించారు. ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం బయ్యనగుడెం నుంచి రామానుజపురం సిమెంట్ తూరను ట్రాక్టర్‌పై తీసుకువెళుతుండగా మోషే ట్రాక్టర్‌పై నుంచి కాలుజారి రోడ్డుపై పడ్డాడు. తలకు బలమైనదెబ్బ తగలడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఇసుక లారీ సీజ్

కొయ్యలగూడెం: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. రాజవరం పంచాయతీ గంగవరం సమీపంలోని ఎర్రకాలువ నుంచి మంగళవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు లారీని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

గోదావరి కాల్వలో వృద్ధురాలి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చిన దృశ్యం

భీమడోలు: మండలంలోని పూళ్ల శివారు గోదావరి కాల్వలో బుధవారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. పూళ్లలోని కుమ్మరికుంటకు చెందిన పచ్చా సీతారత్నం(65)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సీతారత్నంకు పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా తగ్గడం లేదు. దీనితో జీవితంపై విరక్తిగా ఉందని ఆమె పలుమార్లు భర్త పచ్చా కాశీవిశ్వనాథరావు వద్ద వేదనకు గురవుతూ ఉండేది. ఈ క్రమంలో ఈనెల 14న సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై భర్త కాశీ విశ్వనాథరావు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీమడోలు అగ్నిమాపక అధికారి నాగరాజు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది గోదావరి కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం సీతారత్నం మృతదేహం లభ్యమైంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెంటపాడు: వ్యవసాయ సస్యరక్షణలో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధ్యం అని వ్యవసాయశాఖ జేడీ జెడ్. వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం పెంటపాడు మండలంలోని రాచర్ల గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా గూడెం ఏడీఏ మురళీకృష్ణ, పెంటపాడు ఏవో కె.పార్థసారథి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ ఎండుతెగులు, ఆకుముడత, ఎర్రనల్లి ఎక్కువగా ఉన్న దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిపైరుపై ఆశించబోయే తెగుళ్ల విషయంలో రైతులు ఇష్టానుసారంగా పురుగుమందులు వాడకుండా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. వీఏఏలు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలిక మృతి కేసులో నిందితుడి అరెస్ట్

మొగల్తూరు: బాలిక అనుమానాస్పద మృతి కేసులో ఏ2 నిందితుడు గుడాల నాగ దుర్గాప్రసాద్‌ని ఆచంటలో సీఐ దుర్గాప్రసాద్ అరెస్ట్ చేసినట్లు ఎస్సై వాసు బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మొగల్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఈనెల 5వ తేదీన ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈనెల 10వ తేదీన బాలిక హైదరాబాద్‌లో మృతి చెందినట్లుగా ఉస్మానియా ఆసుపత్రి నుంచి పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై వాసు హైదరాబాద్ వెళ్లి విచారణ చేపట్టి ముగ్గురు వ్యక్తులను అనుమానితులుగా గుర్తించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈకేసులో ఏ2గా నమోదు చేసిన గుడాల నాగ దుర్గాప్రసాద్‌ను బుధవారం పోలీసులు ఆచంటలో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించింది. ఈకేసులో మిగిలిన ఇద్దరు వ్యక్తుల కోసం గాలిస్తున్నామని, త్వరలో అరెస్ట్ చేయడం జరుగుతుందని ఎస్సై చెప్పారు.

వచ్చేనెల 16న ఐఆర్‌సీటీసీ శబరిమల యాత్ర

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో వచ్చే నెల 16న శబరిమల యాత్ర నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈయాత్ర మొత్తంగా నాలుగు రాత్రులు, ఐదు పగళ్లుగా సాగుతుందన్నారు. వచ్చేనెల 16వ తేదీ ఉదయం సికింద్రాబాద్‌లో ప్రారంభమయ్యే ఈ రైలు నల్గొండ, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు మీదుగా కేరళలోని చెంగనూరు చేరుతుందన్నారు. ప్రయాణికులకు అల్పాహారం, భోజన సదుపాయాలు, ట్రావెల్ ఇన్సూరెన్స్‌ను కల్పించనున్నట్లు తెలియజేశారు. వివరాలకు సీహెచ్ బాలాజీ 92810 30714, సీహెచ్ సతీష్ 92810 30712, ఓ.నరేష్ 92810 30711, సంతోష్ 92810 30734, అఖిల 92810 30705 నందు సంప్రదించాలని విజయవాడ ఏరియా మేనేజర్ రాజా కోరారు.

డీజే సౌండ్ సిస్టం నిషేధించాలని కేసు దాఖలు

ఏలూరు (టూటౌన్): డీజే సౌండ్ సిస్టం వల్ల విపరీతమైన శబ్ద కాలుష్యం వ్యాప్తి చెంది ప్రజల మానసిక స్థితి దెబ్బతింటుందని, డీజే సౌండ్ సిస్టం నిషేధించాలని సీనియర్ న్యాయవాది చిక్కా భీమేశ్వరరావు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఏలూరు కోర్టులో ప్రీ లిటిగేషన్ కేసుగా దాఖలు చేశారు. ఈ పిటిషన్ పరిశీలించిన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ ప్రతివాదులైన కలెక్టర్, ఎస్పీ, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి, ఏలూరు కార్పొరేషన్ కమిషనర్లకు నోటీసులు జారీ చేశారు. ఈనెల 21వ తేదీన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ కోర్టుకు హాజరుకావాలని న్యాయమూర్తి వారికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది చిక్కా భీమేశ్వరరావు మాట్లాడుతూ ఈ డీజే సౌండ్ సిస్టమ్ 5 నిమిషాలపాటు వింటే 50 నుంచి 70 డెసిబెల్స్ కంటే ఎక్కువ శబ్దం వస్తుందని, అది ఒక వ్యక్తి గుండెను ప్రభావితం చేస్తుందన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. డీజే సిస్టంలను భారీ వాహనాల్లో పలుచోట్లకు భారీ శబ్దాలతో తరలించడం కారణంగా ఎలక్ట్రికల్ వైర్లు తగిలి పలువురు ప్రాణాలు కూడా కోల్పోతున్నారని చెప్పారు. అంతేకాకుండా ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందన్నారు.

క్లుప్తంగా

మానవత ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

పెంటపాడు: మండలానికి చెందిన ఉండ్రావరపు గోపి ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై పలు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న గోపిని ఈ సందర్భంగా బుధవారం మానవత నాయకులు పరామర్శించారు. మానవత జిల్లా పరిరక్షణ చైర్మన్, జిల్లా విద్యాకమిటీ అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు ఆధ్వర్యంలో గోపికి రూ. 11 వేలు అందజేశారు. పెంటపాడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ ఎస్. నాగరాజు మాట్లాడుతూ మానవత సంస్థ చేస్తున్న పలు సేవాకార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నక్కా సాంబశివరావు, పోలుమాటి జయరాజు, విప్పరి వినాయకుడు, మానవత మండల అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై నూనె ప్యాకెట్లు



రాయితీపై నూనె ప్యాకెట్లు అందజేస్తున్న తహసీల్దార్ సునీల్ కుమార్

తాడేపల్లిగూడెం: ప్రభుత్వం నిర్ణయించిన ధరకు వంటనూనె ప్యాకెట్లను విక్రయించే కేంద్రాన్ని బుధవారం పట్టణంలో తహసీల్దార్ సునీల్‌కుమార్ ప్రారంభించారు. డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. 14వ వార్డు లక్ష్మీప్రసన్న ఎంటర్‌ప్రైజెస్‌లో నూనెలు విక్రయించారు. సన్‌ఫ్లవర్‌ప్యాకెట్ 124 రూపాయలు, పామాయిల్ ప్యాకెట్ 110 రూపాయలకు విక్రయించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ రమణ

నరసాపురం రూరల్: రుణాల మంజూరు, వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా చేరుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రమణ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం నరసాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన బ్యాంకర్లు, ఇతర శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రభుత్వం రైతు రుణాలను రీషెడ్యూల్ చేసిందన్నారు. ఇందుకు తగ్గ విధివిధానాలను బ్యాంకర్లకు వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ మంగపతిరావు, డీపీఎంలు కొండవేటి శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేద రోగులకు మందుల వితరణ



మందులు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు

పాలకొల్లు అర్బన్: పేద రోగులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు ముందుకు రావాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. పాలకోడేరు మండలం మోగల్లుకు చెందిన ఈడేపల్లి తల్లి అనే వృద్ధురాలు ఫిట్స్ వ్యాధితో బాధపడుతూ మందులు కొనుగోలు చేసుకోవడానికి ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని వాకర్స్ క్లబ్ దృష్టికి తీసుకురావడంతో క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు స్పందించి రూ.10 వేల విలువైన మందులను బుధవారం ప్రియాంక టవర్స్ వద్ద రోగికి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, జవ్వాజి కల్యాణ్, బోనం రాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రీ సర్వే గ్రామ సభలు

పెనుగొండ: ఆచంట మండలంలో ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకూ గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆచంట తహసీల్దార్ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న పెనుమంచిలి, 22న కరుగోరుమిల్లి, 24న కందరవల్లి, 26న కొడమంచిలిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తామని వివరించారు. గ్రామ సచివాలయంలో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

నిండా ముంచిన వర్షాలు

- 'గూడెం' మండలంలో ఖరీఫ్ సాగుకు తిలోదకాలు
- దాదాపు 250 ఎకరాల్లో పండని పంట
- దీనస్థితిలో రైతాంగం



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం బాడవాలో సాగు చేయని భూములు

తాడేపల్లిగూడెం రూరల్: దేశానికి వెన్నుముక రైతన్న. ఎన్నో విపత్తులను సైతం ఎదుర్కొంటూనే పట్టువదలని విక్రమార్కునిలా సాగు చేపట్టి దేశానికి అన్నం పెడుతున్నాడు. అటువంటి రైతాంగం నేడు దీన స్థితిలో ఉన్నారు. ప్రధానంగా తాడేపల్లిగూడెం మండలంలో ఎర్ర కాలువ పరీవాహక గ్రామాలైన జగన్నాథపురం, మాధవరం, మారంపల్లి, దండగర్ర, నవాబుపాలెం తదితర గ్రామాల్లో రైతాంగం ఖరీఫ్ సాగును కోల్పోయారు. ఎర్ర కాలువ పరీవాహక గ్రామాలు కావడంతో తుపాన్లకు ఎర్ర కాలువ ఉప్పొంగి పంట చేలను ముంచెత్తింది. ఎర్ర కాలువ ఉప్పొంగి శాంతించడం, రైతులు నాట్లు వేసుకోవడం, మళ్లీ ముంచెత్తడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. దాదాపు రెండు, మూడు సార్లు రైతాంగం నారును ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి మరీ చేలను ఊడ్చారు. అప్పటికే ఎకరానికి రూ.10వేల వరకు పెట్టుబడులు పెట్టారు. రమారమీ 250 ఎకరాల రైతాంగం ఈ పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఖరీఫ్ సాగు కోసం పెట్టిన పెట్టుబడులన్నీ నీటి పాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ సైతం దాటిపోవడంతో సాగును వదులుకున్నారు. అయితే, పొరుగు రైతులు పంట పండించి మిల్లులకు తరలిస్తుంటే ఖరీఫ్ సీజన్‌ను వదులుకున్న రైతాంగం ఉసూరుమంటూ నిట్టూరుస్తున్నారు. పలు చోట్ల పంట పండక భూమి నెరలు తీసిన దృశ్యాలు అనేకం ఉన్నాయి.



జగన్నాథపురం తుమ్మ వడుపులో నెర్రలు తీసిన చేను

మళ్లీ అప్పులు చేసి దాళ్వాకు సన్నద్ధం



ఖరీఫ్ సీజన్‌ను పూర్తి స్థాయిలో కోల్పోయాం. నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఇచ్చే పరిహారం అందని పరిస్థితి. దీంతో దాళ్వా సీజన్ సాగుకు అప్పుల కోసం తిరుగుతున్నాం. అప్పు పుట్టే పరిస్థితి లేదు. గత ప్రభుత్వంలో పెట్టుబడి సాయం వచ్చేది. దాంతో సాగు చేపట్టే వాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు.

– పులగం సుబ్బారావు, జగన్నాథపురం, తాడేపల్లిగూడెం మండలం

రెండు దఫాలు రూ.2.85 లక్షలు నష్టపోయాం



ఖరీఫ్ సీజన్‌లో రెండు దఫాలు ఎర్ర కాలువకు వచ్చి వరద కారణంగా దాదాపు 19 ఎకరాలు నష్టపోయాం. రెండు సార్లు రూ.15వేలు చొప్పున 19 ఎకరాలకు రూ.2.85లక్షలు నష్టం వాటిల్లింది. దీంతో మూడోసారి సాగు చేపట్టలేక వదిలేశాం.

– చిట్టూరి భాస్కరరావు (బాపన్న), కౌలు రైతు, జగన్నాథపురం, తాడేపల్లిగూడెం మండలం

వైభవంగా అమ్మవారి ఊరేగింపులు





వీకర్స్‌కాలనీ గాయత్రి అమ్మవారు, ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా మహోత్సవాలు ముగింపు సందర్భంగాను పట్టణంలో పలు ప్రాంతాలలో బుధవారం అమ్మవారి ఊరేగింపులు అంగరంగ వైభవంగా జరిగాయి. గరగ నృత్యాలు, విచిత్ర వేషాలు, అమ్మవార్ల రూపాలతో, బాజా భజంత్రీలు, బాణ సంచాలతో అమ్మవారిని పట్టణంలో ఘనంగా ఊరేగించారు. వీకర్స్‌కాలనీ గాయిత్రి గుడి వద్ద అమ్మవారిని ఉత్సవ కమిటీ సభ్యులచే ఊరేగించారు. భాగ్యలక్ష్మిపేటలో అమ్మవారిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగించారు. శ్రీ వాసవి ఆలయంలో అమ్మవారి దసరా మహోత్సవాలను ద్విగిజయంగా పూర్తి చేసిన సందర్భంగా ఆర్యవైశ్యులకు సత్కారాలు జరిగాయి. ఈ నెల 11వ తేదీన గురువారం అమ్మవారి ఊరేగింపు జరగనున్నది. వాసవి మాత వెండి రథోత్సవం పట్టణంలో నిర్వహించనున్నారు.

18 నుంచి గ్రామసభలు

ఇరగవరం: భూ సమస్యల పరిష్కారానికి 18నుంచి గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ సుందరరాజు తెలిపారు. మండలంలో కె కుముదవల్లి, ఆర్ కంఠ్రిక, తూర్పువిప్పర్రు, కె ఇల్లిందలపర్రు, గోటేరు, ఏలేటిపాడు, అయితంపూడి, సూరంపూడి , రాపాక, అయినపర్రు, ఓగిడి, కాకిలేరు. కంతేరు. కావలిపురం, గ్రామాలలో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ

తణుకు టౌన్: మెరుగైన భవిష్యత్‌కు ఆహార భద్రతను హక్కుగా పాటించాలని ప్రముఖ సామాజిక వేత్త డీవీవీఎస్ వర్మ చెప్పారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా తణుకు బ్యాంక్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వర్మ మాట్లాడుతూ మానవ వికాసంలో ఆహారం ప్రధాన పాత్ర వహిస్తుందని, ఆహారం ద్వారానే రోగాలను దూరం చేయడంతో పాటు జీవిత కాల ప్రమాణాలు పెరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్ అవసరాల కోసం ఆహార భద్రతను పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ మనోరమ, కోడూరి ఆంజనేయులు, వడ్లమాని పార్వతి, అసోసియేషన్ కార్యదర్శి ఎండీ స్వాలీహా, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు పాల్గొన్నారు.

మాల్స్ ఖాళీ..దుకాణాలు ఓపెన్

ప్రారంభమైన మద్యం దుకాణాలు



స్టాకు తరలింపు ప్రక్రియను పరిశీలిస్తున్న గూడెం ఆర్‌డీఓ వై.భవానీ శంకరి

తాడేపల్లిగూడెం: మద్యం కొత్త వ్యాపారానికి దుకాణాలు దక్కించుకున్న వారు బుధవారం శ్రీకారం చుట్టారు. పట్టణంలో వాస్తవంగా 12 దుకాణాలుండగా, 11 దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. అవి దక్కించుకున్న వారు నిబంధనలు, మార్గదర్శకాలను చూసుకొని నూతన వ్యాపారం ప్రారంభించారు. 11 దుకాణాలకు ప్రాంగణాలు ఖరారయ్యాయి. దుకాణాలు ప్రారంభం బుధవారం నుంచి అధికారికంగా ఆమోదం రావడంతో సరుకు కోసం డిపోలు వద్ద రద్దీ పెరిగింది. పట్టణంలో సాయంత్రానికి నాలుగు దుకాణాలకు ఒక్కొక్క దుకాణానికి రూ.25 లక్షల వంతున కోటి రూపాయల వంతున సరుకు వచ్చింది. గురువారం ఉదయానికి మొత్తం ఇండెంట్ ప్రకారం సరుకు రానున్నది. పాత మద్యం పాలసీ ప్రకారం పట్టణంలో మూడు మాల్స్ ఉన్నాయి. వీటిలో సరుకు 75 లక్షల రూపాయల వరకు ఉంది. ఈ సరుకును ఎక్సైజ్ సీఐ కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో మాల్స్‌ను ఖాళీ చేయించారు. ఖాళీ చేసిన సరుకును పర్యవేక్షకుల సమక్షంలో వాహనాలలో డిపోకు పంపించారు. సరుకు తరలింపు ప్రక్రియను గూడెం ఆర్‌డీఓ వై.భవానీ శంకరి పర్యవేక్షించారు. ఆమె వెంట తహసీల్దార్ సునీల్‌కుమార్ ఉన్నారు.

పీజీ ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సుకు స్పాట్ కౌన్సెలింగ్

తణుకు టౌన్: తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పీజీ కోర్సుకు సంబంధించి ఈనెల 17వ తేదీ నుంచి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ తెలిపారు. తణుకు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీ కోర్సులకు సంబంధించిన ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీకి సంబంధించిన మిగిలిపోయిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీజీ సెట్ 2024 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికేట్‌లతో స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి గ్రామ దర్శిని

తణుకు టౌన్: నియోజవకర్గంలోని గ్రామల్లో సమస్యలను పరిష్కారానికి గ్రామ దర్శిని కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. బుధవారం తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామంలో నిర్వహించిన గ్రామ దర్శిని కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామాల్లో నెలకొన్న ఆర్థిక, మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించేందుకు, ప్రజల సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకు గ్రామ దర్శిని కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈసందర్భంగా కొమరవరం గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శంకుస్థాపన చేశారు.

ప్రజల సమస్యలను తెలుసుకోవాలి



ఇటుకులగుంట గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లోనే నాయకులు ఉండి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఇటుకులగుంట గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.40లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ప్రజలు గెలిపించారని, ప్రజలకు సేవకుడిగా ఉంటానన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న రహదారులపై దమ్ము చక్రాలు తిప్పకుండా రైతాంగం కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వనాథ్, జనసేన పట్టణాధ్యక్షుడు వర్తనపల్లి కాశి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



ఉరదాళ్లపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే రాధాకృష్ణ

అత్తిలి: పల్లెలను ప్రగతిబాటలో నడిపేందుకు ప్రభుత్వం గ్రామాలలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులు రూ. 1.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్, రోడ్డు, మినీ గోకులం షెడ్‌కు కలెక్టర్ నాగరాణి, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామస్తులకు ఉపయోగపడే పనులను గుర్తించి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ దాసం తాతాజీ, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, దాసం బాబ్జి, ఎంపీడీవో పి శామ్యూల్, తహసీల్దార్ దశిక వంశీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మొగల్తూరు: ప్రజల సమస్యలు ఏ శాఖకు వచ్చినా సంబంధిత అధికారితో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుదవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను పరిష్కరించే విషయంలో అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. సమస్య ఏదైనా ఫిర్యాదుదారుడు, ప్రత్యర్థులను విచారించి, సమస్య మరోసారి తలెత్తకుండా పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి, ఎస్సై జి.వాసు, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, ఏవో అబ్దుల్ రహీమ్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పశుపోషణలో ఆరోగ్య సంరక్షణ ముఖ్యం

మొగల్తూరు: పశుపోషణలో ఆరోగ్య సంరక్షణ చాలా ముఖ్యమని వెటర్నరీ డాక్టర్ జి.నీలిమ తెలిపారు. బుదవారం మండలంలోని కాళీపట్నం తూర్పు గ్రామంలో పొలం పిలుస్తొంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మొగల్తూరు పశు వైద్యశాఖ డాక్టర్ నీలిమ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వహిస్తే పశువుల ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు పాల దిగుబడి కూడా తగ్గిపోతుందన్నారు. పశువుల యజమానులకు కావలసిన సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ మేడిది సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు తణుకుల శ్రీ వెంకట దుర్గ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వై.వి.లక్ష్మణరావు, హెల్త్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదామని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. వీకర్స్‌కాలనీ, యాగర్లపల్లి పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని 6, 14,17 వార్డులలో ఆరోగ్య కార్యక్రమాలు నిర్వ హించారు. అవగాహన సదస్సులు, ర్యాలీలు జరిగాయి. ఇళ్ల వద్ద ఫ్రిజ్‌లు, నీటి నిల్వల ప్రాంతాలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, వారానికి ఒక్కసారి ఫ్రై డే, డ్రై డే పాటించినట్లు అయితే దోమల వల్ల వెచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని చెప్పారు. శానిటేషన్ కార్యదర్శి దీపిక, వార్డు కార్యదర్శులు రాజేశ్వరి, ప్రశాంతి, మేరీ, అంగన్‌వాడీ సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదుస్సు ఈ నెల 18వ తేదీన విజయవాడలో జరుగుతుందని, జయప్రదం చేయాలని సంఘ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో ఈ మేరకు సదస్సు విజయవంతం కోరుతూ వాల్ పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వర ప్రసాద్ మాట్లాడుతూ కార్మికవర్గం, వారి హక్కులు, కార్మిక చట్టాలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, చట్టాలు, సంక్షేమబోర్డు, అంగన్‌వాడీ, ఆశాలు, మధ్యాహ్న భోజనం, స్కీం వర్కర్లు, ఇతర సమస్యలపై రాష్ట్ర సదస్సులో చర్చిస్తామని చెప్పారు. ప్రసాద్ కుమార్, వెంకటేశ్వరరావు, రాము, మహమ్మద్, అసిన్, బాబ్జి, పి.దుర్గా ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

కుంచనపల్లిలో 100 గొర్రెలకు టీకాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో బుధవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాల వేసే కార్యక్రమం నిర్వహించారు. వెటర్నరీ ఏడీ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ టీకాల కార్యక్రమం జరిగింది. కుంచనపల్లిలో 100 గొర్రెలకు నట్టల నివారణ టీకాలు వేసినట్లు ఏడీ అనిల్‌కుమార్ తెలిపారు. రెండవ రోజు గురువారం కుంచనపల్లి గ్రామంలో ఈ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18న జగ్గన్నపేట, 19న పెదతాడేపల్లి, 21న వెంకట్రామన్నగూడెం, 22న నీలాద్రిపురం, 23న బంగారుగూడెం, 24న కడియద్ద గ్రామాల్లో టీకాలు వేస్తామని మండల పశువైద్యాధికారి టీవీ.విజయ్‌కుమార్ వివరించారు. జీవాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామికి పడిపూజ



తణుకులో అయ్యప్పస్వామికి పడిపూజ నిర్వహిస్తున్న మాలదారులు

తణుకు అర్బన్: తణుకు జాతీయరహదారి సమీపంలోని శ్రీధర్మశాస్త్ర పంచాయతన అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి స్వామివారికి కన్నులపండువగా పడిపూజ నిర్వహించారు. గురుస్వామి చలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పడిపూజ కార్యక్రమంలో స్వామివారిని విశేషంగా అలకంరించారు. స్వామివారు అధిరోహించే మెట్ల అలంకరణను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. నిత్య పూజారి సత్యనారాయణ సమక్షంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం గురుస్వామి చక్రి ఆలపించిన అయ్యప్పస్వామి భక్తిగీతాలు ఆహుతులను అలరించాయి. పూజాధికాల అనంతరం 250 మంది స్వాములు అల్పాహారం స్వీకరించారు. ఈ పడిపూజలో మాలదారులు రాజ్‌కుమార్, ప్రసాద్, హనుమాన్, పల్లారావు, గాదె నాని, వెంకట్, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మణస్వామి సేవలు చిరస్మరణీయం



కామ్రేడ్ లక్ష్మణస్వామికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సహకార సంఘాల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సొసైటీల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన ఎ.లక్ష్మణస్వామి చిరస్మరణీయుడని, ఆయన అకాల మృతి ఉద్యోగుల సంఘానికి తీరనిలోటు అని సహకార సంఘాల ఉద్యోగులు యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సహకార సంఘాల జిల్లా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడుగాను, ప్రధాన కార్యదర్శి, కన్వీనర్‌గారు చేసిన లక్ష్మణస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పట్టణంలో బుధవారం సొసైటీలో సంతాప సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ జిల్లా ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటాన్ని నిర్వహించారని, లక్ష్మణ స్వామి మృతి ఉద్యోగ సంఘాలకే కాక యూనియన్లకు తీరని లోటు అన్నారు. మరిన్ని పోరాటాలకు ఐక్యతతో ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.సత్యనారాయణ మాట్లాడారు. తొలుత లక్ష్మణస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. జిల్లా ఉపాధ్యాక్షులు కర్రి నాగేశ్వరరావు, మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభ్యాసం వినూత్నంగా కొనసాగించాలి

పాలకొల్లు అర్బన్: కొత్త ఆలోచనలతో నూతన కృత్యాలను ఆవిష్కరించే దిశగా విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్(కాకినాడ), పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి జి నాగమణి చెప్పారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం నాగమణి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల అటల్ ల్యాబ్‌ను సందర్శించారు. విద్యార్థులు రూపొందించిన రోబోటిక్, చంద్రయాన్ నమూనాలను ఆమె పరిశీలించారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచిన పాఠశాల విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. పదో తరగతిలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల ప్రగతిని ఆమె సమీక్షించారు.

కన్నుల పండువగా వెంకన్న కల్యాణం

కాళ్ల: గోవింద నామస్మరణతో కాళ్లకూరు మార్మోగింది. కాళ్ల మండలం కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆశ్వయుజమాస లఘు (చిన్న) కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీమాన్ అరంగంటి ఝాన్సీలక్ష్మి కుమారులచే ఆలయ అర్చకులచే వేద పండితులు అనిపెద్ది ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు.